జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు
ఎడిటర్ : 90520 45435

PUBLISH IN HYDERABADH | సంపుటి : 01 సంచిక : 193 | SANDESHAM TIMES | మంగళవారం 09 - 12 - 2025 | SANDESHAM TIMES TELUGU DAILY

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

# జాతీయ సగటును మించిన ఏపీ జీఎస్‌డీపీ

ఈ ఆర్థిక సంవత్సరానికి 17.11 శాతం వృద్ధి సాధించడమే లక్ష్యమని వెల్లడి

గణాంకాలు విడుదల చేసిన చంద్రబాబు

సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

2025-26 తొలి అర్థ సంవత్సరంలో 10.91 శాతం జీఎస్‌డీపీ వృద్ధి నమోదు

పారిశ్రామిక రంగంలో 12.05 శాతం, సేవల రంగంలో 11 శాతం వృద్ధి

గత ఐదేళ్లలో రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల జీఎస్‌డీపీ నష్టపోయిందన్న సీఎం

తలసరి ఆదాయం జాతీయ సగటును దాటి రూ.2.66 లక్షలకు చేరింది



**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ తిరిగి ప్రగతి పథంలో పరుగులు పెడుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగంలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధిరేటు 10.91 శాతంగా నమోదైంది. ఇదే కాలానికి జాతీయ సగటు 8.8 శాతంతో పోలిస్తే ఇది గణనీయంగా అధికం. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం మీడియా సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రంగాల వారీగా ఆర్థిక ప్రగతి వివరాలను వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక రంగం తిరిగి గాడిలో పడిందని, అన్ని రంగాల్లోనూ సానుకూల వృద్ధి కనిపిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

**రంగాల వారీగా ప్రగతి ఇలా...!**

2025-26 రెండో త్రైమాసికం నాటికి వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో బలమైన వృద్ధి నమోదైనట్లు సీఎం వివరించారు. ఈ త్రైమాసికంలో వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూల విలువ జోడింపు (జీవీఏ) రూ.1,25,571 కోట్లుగా ఉండగా, పారిశ్రామిక రంగం జీవీఏ రూ.86,456 కోట్లు, సేవల రంగం జీవీఏ రూ.1,60,075 కోట్లుగా నమోదైంది. ముఖ్యంగా పారిశ్రామిక రంగం 2.78 శాతం నుంచి ఏకంగా 12.20 శాతానికి ఎగబాకి జాతీయ సగటును అధిగమించడం విశేషం. వ్యవసాయ రంగంలో 11.43 శాతం వృద్ధిరేటు సాధించగా, అందులో మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో రికార్డు స్థాయిలో 26.27 శాతం వృద్ధి కనిపించింది. వరి దిగుబడి గతంతో పోలిస్తే 23.95 శాతం పెరిగి 3.64 లక్షల మెట్రిక్ టన్నులకు చేరింది. అరటి దిగుబడిలో అనూహ్యంగా 151.2 శాతం వృద్ధితో 37.31 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి నమోదైంది. మత్స్య, రొయ్యల దిగుబడి కూడా వరుసగా 17.30, 27.09 శాతం పెరిగింది. పారిశ్రామిక రంగంలో మైనింగ్ 18.43 శాతం, తయారీ రంగం 11.66 శాతం, నిర్మాణ రంగం 11.81 శాతం వృద్ధిని నమోదు చేశాయి. విద్యుత్ ఉత్పత్తి 19.12 శాతం పెరిగి 26,837 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. సేవల రంగంలో రియల్ ఎస్టేట్ 14.31 శాతంతో అగ్రస్థానంలో నిలవగా, ఆతిథ్య రంగం 8.50 శాతం, రవాణా రంగం 5.99 శాతం

మిగతాది 2 లో...


## కేంద్రమంత్రితో నాదెండ్ల భేటీ

ఏపీ పౌరసరఫరాల శాఖ పనితీరుపై ప్రహ్లాద్ జోషి ప్రశంసలు

- కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో నాదెండ్ల మనోహర్ భేటీ
- సీఎంఆర్ డెలివరీలో ఏపీ పనితీరుపై కేంద్రమంత్రి నుంచి ప్రశంసలు
- జనవరి నుంచి రాష్ట్రానికి అదనంగా గోధుమలు, రాగుల కేటాయింపునకు అంగీకారం.....
- క్యూఆర్ కోడ్‌తో బియ్యం ట్రాకింగ్ అమలు చేసిన తొలి రాష్ట్రంగా ఏపీ గుర్తింపు
- ధాన్యం సేకరణ వేగవంతం.. రైతులకు 24 గంటల్లోనే చెల్లింపులు

**సందేశం టైమ్స్ :** ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం సేకరణ, పౌరసరఫరాల వ్యవస్థ పనితీరుపై కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను సకాలంలో, స్థిరంగా కేంద్రానికి అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కొనియాడారు. రాష్ట్ర

మిగతాది 2 లో...



## రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలి

- విమానయాన సంక్షోభంపై కేంద్రమంత్రి రామ్మోహన్‌పై తమ్మినేని విమర్శలు
- రామ్మోహన్ అసమర్థత వల్లే విమాన సర్వీసులు కుప్పకూలాయని విమర్శ
- దేశం పరువు పోయిందని మండిపాటు...

**ఆంధ్రప్రదేశ్, సందేశం టైమ్స్ :** ఇటీవల తలెత్తిన ఇండిగో విమానయాన సంక్షోభం నేపథ్యంలో కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిపై వైసీపీ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయన అసమర్థత వల్లే దేశంలో విమాన సర్వీసులు కుప్పకూలాయని, అంతర్జాతీయంగా దేశ పరువు పోయిందని ఆరోపిస్తూ, మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ.. రామ్మోహన్ నాయుడి వైఫల్యం వల్లే దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా విమానాలు



మిగతాది 2 లో...

## 'తాగుబోతుల తెలంగాణ'గా మార్చేందుకు రేవంత్ రెడ్డి

రెండేళ్ల కాంగ్రెస్ పాలన పూర్తిగా విఫలమైందని హరీశ్ రావు విమర్శ

రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డికి రాజీనామా సవాల్

ఫార్మా సిటీ, మెట్రో వంటి ప్రాజెక్టులను రద్దు చేశారని ఆరోపణ

2

**తెలంగాణ, సందేశం టైమ్స్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు మొండి చేయి చూపిందని, పాలన పూర్తిగా ఆగమాగంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్



## చైనాలోని ఆ ప్రావిన్స్ ను స్ఫూర్తిగా తీసుకున్నాం

- కొత్త రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందన్న ముఖ్యమంత్రి
- 2047 నాటికి సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నా-మన్న ముఖ్యమంత్రి
- 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనేది మా ఆశయమని వెల్లడి

మిగతాది 2 లో...

**తెలంగాణ, సందేశం టైమ్స్ :** చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగుతోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.



## రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలి

రద్దయ్యాయని ఆరోపించారు. "మంత్రి ముందస్తు సమన్వయం, సమీక్షలు చేయకపోవడం వల్లే ఇండిగో వంటి సంస్థలు సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ రామ్మోహన్ నాయుడు రాజీనామా చేయాలి. సమస్యపై స్పందించకుండా మీడియాకు ముఖం చాటేయడం సరికాదు" అని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, ఆముదాలవలస వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్ మరింత ఘాటుగా స్పందించారు. రామ్మోహన్ నాయుడును 'రీల్స్ మంత్రి'గా అభివర్ణించారు. "కారెక్కినప్పుడు, దిగినప్పుడు రీల్స్ చేయడంపై ఉన్న శ్రద్ధ తన శాఖపై పెట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. అహ్మదాబాద్‌లో విమానం కూలి 241 మంది మరణిస్తే, అక్కడికి కూడా వెళ్లి రీల్స్ చేస్తారంటూ ఆయన తీవ్రంగా విమర్శించారు. కేంద్రమంత్రిగా, ఎంపీగా శ్రీకాకుళం జిల్లాకు ఒక్క ప్రాజెక్టు అయినా తీసుకొచ్చారా? అని ప్రశ్నించారు. మిమ్మల్ని గెలిపించినందుకు జిల్లా ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారు" అని రవికుమార్ అన్నారు.

## త్వరలోనే విమానయాన సంక్షోబానికి పరిష్కారం

**లోకేష్, రామ్మోహన్ నాయుడు ఎదుగుదలను ఓర్వలేకనే వైసీపీ రాద్ధాంతం – టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం.**



(సందేశం టైమ్స్- కొత్తపేట) కొత్తపేట – విమానయాన వ్యవస్థలో ఇటీవల ఏర్పడిన సంక్షోభం క్రమంగా చక్కబడుతోందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం 1,650 విమానాలు నడవగా, రద్దయిన విమానాల సంఖ్య 800 నుంచి 650కి తగ్గిందని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే సమస్య పూర్తిగా పరిష్కారమవుతుందని అన్నారు. విమానయాన సంక్షోభంపై నారా లోకేష్ సూచనలు చేయడాన్ని వైసీపీ విమర్శించడం దురుద్దేశపూరితమని సుబ్రహ్మణ్యం మండిపడ్డారు. లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎదుగుదలను వైసీపీ ఓర్చుకోలేక రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. జాతీయ సమస్యలపై లోకేష్ చేసిన సూచనలు సరైనవేనని ఆయన సమర్థించారు. ఎలాంటి సమస్య అయినా రాజకీయ కోణంలో కాకుండా పరిష్కారం దిశగా సూచనలు ఇవ్వాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో లోకేష్, రామ్మోహన్ నాయుడు ఎదుగుదలను సానుకూలంగా చూడాలని సుబ్రహ్మణ్యం కోరారు.

## శ్రీచైతన్య స్కూల్లో ఘనంగా హ్యాపీ క్లబ్ ప్రోగ్రాం



(సందేశం టైమ్స్ - రావులపాలెం ) రావులపాలెం – శ్రీచైతన్య స్కూల్ లో ఫస్ట్ క్లాస్ విద్యార్థులకు న్యూ అడాప్షన్ ప్రోగ్రాంలో భాగంగా హ్యాపీ క్లబ్ అనే కార్యక్రమం జరిగింది. ఈ ప్రోగ్రాంకు ప్రధానోపాధ్యాయులు జి. జగదీష్ అధ్యక్షత వహించి ఆయన ఉపన్యాసంలో విద్యార్థులు క్రమశిక్షణగా ఉండాలని, పెద్దలపట్ల ఎలా గౌరవంగా ఉండాలి, ఇంటి వద్ద తల్లిదండ్రులకు వారి పనులలో కూడా సహాయం చేస్తూ, వారి పనులు వారే చేసుకుంటూ, క్రమశిక్షణగా ఉంటూ, చదువుల పట్ల శ్రద్ధ వహించాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా రీజనల్ ఇన్చార్జ్ ఎం వి ఎల్ నరేష్ పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు వారి అనుభవాలను పంచుకున్నారు. ప్రైమరీ ఇన్చార్జ్ జి బేబీ కుమారి, డీన్ నాగేంద్ర, సి బ్యాచ్ ఇంచార్జి మూర్తి, ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ రాజేశ్వరి, ఎం.రాజు ఉపాధ్యాయ బృందం పాల్గొని హ్యాపీ క్లబ్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతులకు ఆదాయం రావాలనేదే ప్రభుత్వ ఉద్దేశ్యం





( సందేశం టైమ్స్ - రావులపాలెం) రావులపాలెం – రైతు నిలదొక్కుకోవాలి, రైతులకు ఆదాయం రావాలనేదే ప్రభుత్వ ఉద్దేశ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మార్కెట్ యార్డులో రైతుల కోసం రావులపాలెం సొసైటీ అధ్యక్షులు కె.వి.సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎరువుల దుకాణాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగిస్తూ వ్యవసాయంలో నానాటికీ పెరిగిపోతున్న ఖర్చులను తగ్గించడానికి సాంకేతికతను వినియోగించాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. అందుకోసమే ప్రభుత్వం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించిందని తెలిపారు. తక్కువ ఖర్చుతో పంటలను పండించడం, దిగుబడులు ఎలా పెంచాలి, విత్తనశుద్ధి, రుణ సౌకర్యం, మార్కెటింగ్ మొదలైన అంశాల్లో ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రభుత్వ అధికారులు వ్యవసాయం గురించి మనకి చెప్పాలా? మనకి తెలియని వ్యవసాయమా? అని కొందరు రైతులు అనుకోవచ్చన్నారు. ప్రభుత్వం చెబుతున్న పంచ సూత్రాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మారిన కాలం బట్టి ముందస్తు అంచనాలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డిమాండ్ ఆధారిత పంటలు పండించడం ఎలా? ఏ పంటకు రేటు వస్తుంది అనేది తెలుసుకుని పండించడం, పంట మార్పిడి మొదలైన వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. పంటలకు విలువ పెంచేందుకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకుంటే సబ్సిడీ కూడా ప్రభుత్వం ఇస్తుందన్నారు. పసుపు పండించడమే కాకుండా, గ్రైండ్ చేసి విక్రయించడం చేయవచ్చన్నారు. అరటి నుంచి 20 వరకూ ఉప ఉత్పత్తులను తయారుచేయచ్చన్నారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలు స్థాపించవచ్చన్నారు. నానో యూరియా వాడటం ద్వారా, డ్రోన్ల ద్వారా పురుగు మందులు చల్లడం ద్వారా శ్రమ, ఖర్చు తగ్గుతాయని అన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, కేతా శ్రీను, జక్కంపూడి బాలాజీ, కొప్పిశెట్టి ప్రసాద్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ సగటును మించిన ఏపీ జీఎస్‌డీపీ



వృద్ధిని సాధించాయి. ఈ త్రైమాసికంలోనే జల రవాణా ద్వారా 52.50 మిలియన్ టన్నుల కార్గో రవాణా జరగగా, 14.98 లక్షల మంది విమాన ప్రయాణాలు చేశారు.

**గత ఐదేళ్ల పాలనతో పోలిక**

ఈ సందర్భంగా 2014-19 మధ్య టీడీపీ పాలన, 2019-24 మధ్య గత ప్రభుత్వ పాలనలో నమోదైన వృద్ధిరేటును చంద్రబాబు పోల్చిచూపారు. 2014-19 మధ్య జీఎస్‌డీపీ వృద్ధి 13.49 శాతంగా ఉంటే, 2019-24 మధ్య అది 10.32 శాతానికి పడిపోయిందని తెలిపారు. ఈ కారణంగా రాష్ట్రం సుమారు రూ.7 లక్షల కోట్ల జీఎస్‌డీపీని నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే వృద్ధి కొనసాగి ఉంటే రాష్ట్రానికి అదనంగా రూ.76,195 కోట్ల ఆదాయం వచ్చి ఉండేదని విశ్లేషించారు. తలసరి ఆదాయంలో కూడా ఈ వ్యత్యాసం స్పష్టంగా కనిపించిందని, 2018-19లో రూ.1,54,031గా ఉన్న తలసరి ఆదాయం 2023-24 నాటికి రూ.2,37,951కి మాత్రమే పెరిగిందని, కానీ తమ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే దానిని రూ.2,66,240కి పెంచగలిగామని తెలిపారు. ఇది ప్రస్తుత జాతీయ తలసరి ఆదాయం రూ.2,05,324 కంటే ఎక్కువని గుర్తుచేశారు.

**భవిష్యత్ లక్ష్యాలు.. స్వర్ణాంధ్ర-2047**

ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ సంవత్సరంలోనే రూ.7,58,270 కోట్ల జీఎస్‌డీపీ సాధించామని, వార్షిక లక్ష్యంలో ఇది 41 శాతమని చంద్రబాబు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరం పూర్తయ్యే నాటికి రూ.18,65,704 కోట్ల జీఎస్‌డీపీతో 17.11 శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. 2014-19 మధ్య సాధించిన 13.49 శాతం వృద్ధిరేటును కొనసాగించగలిగితే స్వర్ణాంధ్ర-2047 లక్ష్యం నాటికి రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.292 లక్షల కోట్లకు, తలసరి ఆదాయం రూ.49 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని ధీమా వ్యక్తం చేశారు. సుస్థిర ప్రగతితో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు స్పష్టం చేశారు.

# కేంద్రమంత్రితో నాదెండ్ల భేటీ



పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆ శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్‌తో కలిసి ఢిల్లీలో సోమవారం నాడు కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రహ్లాద్ జోషి ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, ప్రజా పంపిణీ వ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలను మనోహర్ ఈ సందర్భంగా కేంద్రమంత్రికి వివరించారు. 2025-26 ఖరీఫ్ సీజన్‌కు గాను ఏపీకి 51 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ లక్ష్యాన్ని కేంద్రం నిర్దేశించగా, ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. కేవలం 25 రోజుల వ్యవధిలోనే 2.69 లక్షల మంది రైతుల నుంచి 17.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, రోజువారీ సేకరణ 90,000 మెట్రిక్ టన్నులకు చేరిందని మంత్రి మనోహర్ తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో రైతుల ముంగిటకే వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా 24 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని వివరించారు. ఇందుకోసం 7.87 కోట్ల గోనె సంచులను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ పనితీరును అభినందించిన కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి, పలు కీలక అంశాలకు ఆమోదం తెలిపారు. సీఎంఆర్ డెలివరీలను మరింత సులభతరం చేసేందుకు వీలుగా ఎఫ్‌సీఐ నుంచి అదనపు నిల్వలకు అనుమతి ఇచ్చారు. అంతేకాకుండా, రాష్ట్ర ప్రజల కోసం జనవరి నుంచి అదనంగా గోధుమలు, రాగులు కేటాయించడానికి అంగీకరించారు. ఇప్పటికే ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆగస్టు నుంచి 16,000 మెట్రిక్ టన్నుల రాగులను పంపిణీ చేస్తున్నామని, జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రాగులు, గోధుమ పిండి అందిస్తామని మనోహర్ తెలిపారు.

**టెక్నాలజీ వినియోగంలో ఏపీ ముందంజ**

మధ్యాహ్న భోజన పథకం (%వీణవీ%) బియ్యం సరఫరాలో పూర్తి పారదర్శకత కోసం క్యూఆర్ కోడ్ ఆధారిత బ్యాగ్ ట్రాకింగ్ వ్యవస్థను అమలు చేసిన దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని మంత్రి మనోహర్ కేంద్రానికి నివేదిక అందించారు. ఈ విధానం ద్వారా రైతు, మిల్లర్, గోడౌన్ల నుంచి ప్రతి బస్తాను ట్రేస్ చేసే అవకాశం ఉందని వివరించారు. ఇదే విధానాన్ని జనవరి నుంచి ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యానికి కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ౖతులు ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను నమ్మి ధాన్యాన్ని అమ్ముకోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలనే సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అరటి వంటి కొన్ని పంటలకు ఊహించని దిగుబడి రావడం వంటి సమస్యలపై ముఖ్యమంత్రి నేతృత్వంలో మంత్రులతో ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేశామని, పొగాకు, మామిడి, పత్తి రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుందని మనోహర్ పేర్కొన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు భూ కేటాయింపులు కూడా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు.

# 'తాగుబోతుల తెలంగాణ'గా మార్చేందుకు రేవంత్ రెడ్డి



రావు విమర్శించారు. పూర్తిస్థాయి రుణమాఫీ జరిగిందని నిరూపిస్తే తాను రాజీనామాకు సిద్ధమని... నిరూపించలేకపోతే రాజీనామాకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధమా? అని సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల పాలన అనేది ప్రభుత్వ పనితీరుకు గీటురాయిలాంటిదని, కానీ ఈ ప్రభుత్వం నిస్సారంగా, నిరర్థకంగా మిగిలిపోయిందని హరీశ్ రావు దుయ్యబట్టారు. "ఈ రెండేళ్లలో ఆత్మస్తుతి, పరనింద తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదు. మా ప్రభుత్వం రాగానే మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాలు తెచ్చాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రజా దర్బార్ కూడా ఇప్పుడు అమలు కావడం లేదు. కేసీఆర్ తెచ్చిన మెట్రో రైలు, ఫార్మా సిటీ వంటి కీలక ప్రాజెక్టులను రద్దు చేయడం మినహా వీరేమీ చేయలేదు" అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ఆదాయం కూడా పూర్తిగా తగ్గిపోయిందని ఆరోపించారు. రైతుల సమస్యలపై హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. "మక్కలు కొని 50 రోజులు దాటినా రైతులకు ఇంకా డబ్బులు ఇవ్వలేదు. రైతులకు బేడీలు వేసిన ఈ ప్రభుత్వం రైతు సంక్షోభ ప్రభుత్వం. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా మద్యం దుకాణాలకు నోటిఫికేషన్లు ఇచ్చి రాష్ట్రాన్ని 'తాగుబోతుల తెలంగాణ'గా మార్చేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు" అని విమర్శించారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు అడిగితే విజిలెన్స్, ఏసీబీ దాడులు చేయిస్తోందని ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్‌ను "గోబెల్స్ సమ్మిట్" అని ఎద్దేవా చేశారు. "గతంలో దావోస్ వెళ్లి డొల్ల కంపెనీలతో ఒప్పందాలు చేసుకుని రేవంత్ నవ్వులపాలయ్యారు. ఇప్పుడు గ్లోబల్ సమ్మిట్ జరుగుతున్న భూమి, ఫార్మా సిటీ కోసం సేకరించిన 13 వేల ఎకరాల భూమి బీఆర్ఎస్ హయాంలో సమీకరించినదే. అందులో రేవంత్ చెమట చుక్క కూడా లేదు" అని అన్నారు. కేసీఆర్ యువత ఉద్యోగాల కోసం ఆలోచిస్తే, రేవంత్ ఆ భూములను తన అనుయాయులకు పంచిపెడుతున్నారని ఆరోపించారు. రెండో ఏడాది పాలన "పెనంలోంచి పొయ్యిలో పడినట్లు ఉంది" అని, మూడో ఏడాది ఏమవుతుందో చూడాలని వ్యాఖ్యానించారు.

# చైనాలోని ఆ ప్రావిన్స్ ను స్ఫూర్తిగా తీసుకున్నాం



గ్వాంగ్‌డాంగ్ రెండు దశాబ్దాల్లోనే అత్యధిక పెట్టుబడులు సాధించిందని తెలిపారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'లో ఆయన మాట్లాడుతూ, కొత్త రాష్ట్రమైనప్పటికీ తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. 2047 నాటికి సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామని అన్నారు. తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనేది తమ ఆశయమని అన్నారు. పారిశ్రామికవేత్తలు, ఆర్థికవేత్తల నుంచి ఆలోచనలను, అభిప్రాయాలను స్వాగతిస్తున్నామని ఆయన అన్నారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని, దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలనేది తమ ఆశయమని అన్నారు. లక్ష్యం పెద్దది అయినప్పటికీ కష్టపడితే అసాధ్యమేమీ కాదని అన్నారు. అందరి సహకారంతో లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలో తెలంగాణ కల సాకారమైందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోనే తెలంగాణ కొత్త రాష్ట్రమని, దేశ జనాభాలో 2.9 శాతమే ఉన్నప్పటికీ, 5 శాతం ఆదాయం ఇస్తున్నామని అన్నారు. ఏ రాష్ట్రం చేయని విధంగా రాష్ట్రాన్ని 3 జోన్లుగా విభజించామని అన్నారు. వాటిని సేవ, తయారీ, వ్యవసాయ రంగాలకు కేటాయించామని అన్నారు. క్యూర్, ప్యూర్, రేర్ జోన్లుగా పిలుచుకుంటున్నామని అన్నారు. చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తిగా ముందుకు వెళుతున్నామని అన్నారు. అది 20 ఏళ్లలోనే అత్యధిక పెట్టుబడులు సాధించిందని వెల్లడించారు. ఇక్కడ కూడా గ్వాంగ్‌డాంగ్ నమూనాను అమలు చేయదలిచామని అన్నారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాలు మాకు ఆదర్శమని అన్నారు. మహాత్మా గాంధీ, అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. వచ్చే పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా, ప్రపంచంలోనే ఉన్నత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

# సర్పంచ్ అభ్యర్థి మృతి రాయికోడ్ మండలంలో విషాదం



**సందేశం టైమ్స్:సంగారెడ్డి జిల్లా ప్రతినిధి 8డిసెంబర్** సంగారెడ్డి జిల్లా, రాయికోడ్ మండలం పిప్పడ్‌పల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి మృతి చెందిన ఘటన నో వ ు ఎా ం ం చోటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం, కాంగ్రెస్ ఆధ్వర్యంలో సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేసిన చాల్కి రాజు అనేక రోజులుగా శివారులోని అయ్యప్ప స్వామి సన్నిధానంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేవాడు. సాధారణంగా లాగే ఉదయం బయటకు వెళ్లిన రాజు తిరిగి సన్నిధానానికి రాకపోవడంతో తోటి స్వాములు అనుమానం చెంది వెతికారు. అనంతరం గ్రామ శివారులో ఆయన మృతదేహం కనిపించడంతో వెంటనే పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి, మరణానికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. ఎల్లప్పుడూ ఉత్సాహంగా పూజా కార్యకలాపాల్లో పాల్గొనే రాజు మృతి స్థానికులతో పాటు తోటి అయ్యప్ప మాలధారులను తీవ్ర విషాదంలో ముంచేసింది. గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి





**పెద్ద దోర్నాల,డిసెంబర్ 08 (సందేశం టైమ్స్):** ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలంలో అనుమానాస్పద మృతి సంభవించింది. సుందరయ్య కాలనీ నుంచిఅయిన ముక్కుల పొలాలకు వెళ్లే మార్గంలో తుమ్మ చెట్టుకు ఉరివేసుకుని వ్యక్తి మృతిచెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. మృతుడు ఎస్సీ పాలెం,అయిన ముక్కల గ్రామానికి చెందిన దర్శనం చిన్న యేసు (55)గా పోలీసులు గుర్తించారు. ప్రాథమిక విచారణలో ఇది ఉరివేసుకుని మరణించిన ఘటనగా అనుమానిస్తున్నట్లు పెద్దదోర్నాల ఎస్ఐ వి. మహేష్ తెలిపారు. ఘటన స్థలానికి ఎర్రగొండపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ కే.అజయ్ కుమార్ చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.మరణానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు.

# కోతుల బెడద నుంచి కాపాడండి



**గిద్దలూరు, డిసెంబర్ 08 (సందేశం టైమ్స్):** ప్రకాశం జిల్లా గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో కోతుల బెడద రోజురోజుకు తీవ్రమవుతోంది. తినుబండారాల కోసం ఇండ్లలోకి వచ్చి ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి.కొంతమంది స్థానికులు కోతుల దాడులతో గాయపడిన ఘటనలు కూడా నమోదయ్యాయి. పలు వీధుల్లో కోతుల గుంపులు తిరుగడంవల్ల పెద్దలు, పిల్లలు రోడ్లపై నడవడానికే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని, స్థానికులు మున్సిపల్ శాఖ అధికారులను కోరుతున్నారు.

# మాల మహానాడు యూత్ ప్రెసిడెంట్‌గా కె. ప్రవీణ్ బాబు నియామకం



**బద్వేల్, డిసెంబర్ 8 (సందేశం టైమ్స్):** మాల మహానాడు రాష్ట్ర కమిటీ తాజాగా బద్వేల్ నియోజకవర్గానికి యూత్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్ బాబును నియమించింది. ఈ నిర్ణయంతో ప్రాంతీయ యువతలో ఉత్సాహం వెల్లివిరిసింది. నియామకం అనంతరం ప్రవీణ్ బాబు రాష్ట్ర కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు, దళితుల అభ్యున్నతి, యువత సాధికారత, సంఘ బలోపేతం కోసం కృషి చేస్తానని వెల్లడించారు.దయువతను ఏకం చేసి, సామాజిక న్యాయం సాధన దిశగా బద్వేల్ నియోజకవర్గంలో కొత్త కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రవీణ్ బాబు పేర్కొన్నారు. మాల మహానాడు ధ్యేయాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లి, ప్రజల సమస్యలకు పరిష్కారాలను కనుగొనడంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# బి.ఆర్. ఆక్స్ ఫర్డ్ జూనియర్ కళాశాలలో సందడి గా ఫేర్ వెల్ డే వేడుకలు






**కందుకూరు, డిసెంబర్ 08 (సందేశం టైమ్స్):** కందుకూరు పట్టణంలోని బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ ఐఐటి,మెడికల్ అకాడమీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫేర్ వెల్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో కళాశాల ప్రాంగణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బి.ఆర్.ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ.. విద్యార్థినీ,విద్యార్థులకు చక్కని విలువలతో కూడిన విద్య తో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు నేర్పుతూ మా విద్యాసంస్థలు అభివృద్ధి చెందడానికి ఎల్లవేళలా కృషి చేస్తున్న అధ్యాపక బృందానికి,ఆదరిస్తున్న తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పేద, మధ్యతరగతి కుటుంబాల వారికి అనుగుణంగా చక్కటి విద్యను విద్యార్థులకు అందించడానికి,అలాగే జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడానికి ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు.అలాగే విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు,డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు,బి.నరేంద్ర బాబు లు వారి విలువైన సందేశాలను, సూచనలను విద్యార్థులకు చక్కగా తెలియజేశారు. అనంతరం ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను సన్మానించి, బహుమతులు అందజేశారు.అలాగే గత విద్యా సంవత్సరంలో చదివి జాతీయస్థాయిలో అడ్వాన్స్ డ్ మెయిన్స్ ర్యాంకులు సాధించి ఐఐటి, ఎన్ఐటి లలో సీట్లు పొందిన విద్యార్థినీ, విద్యార్థులను ప్రత్యేకంగా సత్కరించారు .అంతేకాకుండా ఇంటర్మీడియట్ లో రాష్ట్రస్థాయిలో ఎంపీసీ, బైపిసి విభాగాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ అబ్బూరి వెంకటేశ్వర్లు,షావుల్ హమీద్,ఇర్ఫాన్,పొన్నగంటి వెంకటరావు,ఇంచార్జి వెంకారెడ్డి,ఉపాధ్యాయ సిబ్బంది,కందుకూరు ఆక్స్ ఫర్డ్ పాఠశాల ప్రిన్సిపాల్స్, సిబ్బంది,డిగ్రీ కళాశాల సిబ్బంది, కనిగిరి కాలేజ్ డైరెక్టర్ రాంబాబు,కనిగిరి కాలేజ్ స్కూల్ సిబ్బంది,తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.












# ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించిన అధికారులు

## ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



**లింగసముద్రం, డిసెంబర్ 08 (సందేశం టైమ్స్):** లింగసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో నివాసాలపై ప్రమాదకరంగా ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. రామకృష్ణాపురం గ్రామంలో సుమారు పది ఇళ్లపై 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యుత్ తీగల వల్ల గ్రామంలో పలుమార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి.మేకలు గొర్రెలు కూడా చనిపోయాయి. నూతనంగా ఇల్లు నిర్మించుకోవాలన్నా విద్యుత్ తీగల వల్ల కట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది.దీనివల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఆయన విద్యుత్తు తీగలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు.దీంతో లైన్ మార్చాలంటే ఖర్చు అవుతుందని అధికారులు చెప్పడంతో విద్యుత్ తీగలు తొలగించేందుకు అవసరమైన నిధులను పంచాయతీ నుండి విడుదల చేయించేలా చొరవ తీసుకున్నారు.దీంతో పంచాయతీ నుండి నిధులు మంజూరు అవగానే విద్యుత్ అధికారులు ఇళ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించి ఊరు బయట నుండి విద్యుత్తు లైన్ ను లాగారు.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.గత కొన్ని సంవత్సరాల నుండి ఈ సమస్యతో ఇబ్బంది పడుతున్న తాము అనేకసార్లు ప్రజాప్రతినిధులకు ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఎట్టకేలకు మా మొర విన్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు విద్యుత్ తీగలను తొలగించి మీకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం నాగేశ్వరరావు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యుత్ తీగలు తొలగించేలా చేసినందుకు గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. అదేవిధంగా విద్యుత్ శాఖ ఏడీఈ విజయ్ బాబు,డిఈ వీరయ్య,ఏఈ ఫిరోజ్, పంచాయతీ కార్యదర్శి మాధవరావు,విద్యుత్ సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పాపానికి బహుమానం మరణమే..! దైవమార్గంలో నడవడి





**పోరుమామిళ్ల, డిసెంబర్ 08(సందేశం టైమ్స్):** దైవమార్గాన్ని విడనాడి సైతానుసోదనలకు గురై పాపము చేస్తే అందుకు బహుమానం మరణమేనని కడప బిషప్ హౌస్ ఛాన్సలర్ లక్కినేని ఆరోగ్యరాజ్, పోరుమామిళ్ల డీన్ జాలా విజయ భాస్కర్,అమగంపల్లి విచారణ గురువులు సగిలి థామస్ పేర్కొన్నారు.కడపజిల్లాకాశినాయన మండలం అమగంపల్లి గ్రామంలో 7,8తేదీల్లో రెండు రోజుల పాటు అమలోద్బావిమాత గుడితిరుణాల అత్యంత వైభవంగాజరిగింది.ఈసందర్భంగా దాదాపు 70 సంవత్సరాల క్రితం నిర్మించిన దేవాలయ పండుగ జరిగింది. ఈసందర్భంగా దాదాపు 15 మందిగురువులు,10 సిస్టర్స్ ప్రత్యేక పూజలు చేశారు. అమగం పల్లి పురవీధుల్లో అమలోద్భవి మాత స్వరూపంకందుల రవికుమార్ ఆధ్వర్యంలో భజనతో ఊరేగింపు చేశారు. పాదర్ అరుణ్ కుమార్ చే స్వస్థతా ప్రార్థన కూటములు నిర్వ హించారు. ఈసందర్భంగా దాదాపు 2 వేలమంది భక్తులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో దైవమార్గంలో ప్రజలు



పయనించకుండా ద్వేషం, పగ,ప్రతీకారాలతో జీవితం సాగిస్తున్నారన్నారు.ఇదే గొప్పదని బావిస్తున్నారని కేవలం ఇవన్ని సైతాను సోదనలే అన్నారు.ప్రతి ఒక్కరు క్షమగుణం,ప్రేమ ,కరుణ కలిగి జీవించాలని కోరారు. క్షమా గుణం లేనప్పుడు నీవెన్నిపూజలు చేసిన వ్యర్థమన్నారు. విశ్వసనీయత కలిగి జీవించాలని కోరారు.అమలోద్భవి మాత దేవాలయం పండుగకొనియా డేముందు పాప జీవితానికి ఫుల్ స్టాప్ పెట్టాలని కోరారు.ప్రతి బిడ్డ దేవుని బిడ్డగా జీవించాలని,రాబోయే క్రీస్తు రాకడ కు సిద్ధం కావాల న్నారు.

**భక్తులకు అన్నదానం వితరణ...**

అమలోద్భవి మాత తిరుణాలకు వచ్చిన భక్తులకు వైయస్సార్సీపి జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి,వారి కుటుంబ సభ్యులు, మల్లెపల్లెకు చెందిన జయచంద్ర కుటుంబం అన్నదానం నిర్వహించారు. అనంతరంఅమగంపల్లి,ఇటుగుళ్లపాడు,గ్రామాలకు చెందిన భజన బృందం తో భజన గురువులు రవికుమార్, శేఖర్,గురయ్య ఆధ్వర్యంలో భజన కార్యక్రమం నిర్వహించారు.

# సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి







**ఒంగోలు, డిసెంబర్ 08 (సందేశం టైమ్స్):** సమిష్టిగా సమన్వయంతో పని చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి చెప్పారు. బంగారు పథకాన్ని సాధించడం ద్వారా ఎర్రగొండపాలెం యాస్పిరేషనల్ బ్లాక్ సాధించిన విజయమే దీనికి నిదర్శనమని అన్నారు. ఈ విజయంలో భాగస్వాములైన ప్రభుత్వ సిబ్బందికి అభినందన కార్యక్రమాన్ని జిల్లా ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, ఎర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎర్రగొండపాలెం మండల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు జిల్లా మొత్తానికీ స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. వీరి అనుభవాలతో జిల్లా మొత్తాన్నీ ఇదేవిధంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న పురోగతిని ఉన్నత స్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ఈ విజయం లభించిందన్నారు. ఇలాంటి అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సమ్మిళితం చేస్తూ ప్రతి రెవిన్యూ డివిజన్ లోనూ ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని అమలు చేస్తున్నామన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ.. ఉత్తమ పనితీరుకు ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. అలాంటి వారికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా నిలుస్తుంది' అని చెప్పారు. అందుకే మండల స్థాయిలో కాకుండా జిల్లా స్థాయిలో ఈ అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసామన్నారు. విజేతలకు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సదుపాయాలను కల్పించడంతోపాటు మౌలిక వసతులు అందుబాటులోకి తేవడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. అదే స్ఫూర్తితో అధికారులు, సిబ్బంది కూడా పనిచేయటం ద్వారా ఎర్రగొండపాలెం మండలానికి ఈ గుర్తింపు లభించిందనిఅన్నారు. ఆయా విభాగాలలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేలా పర్యవేక్షించిన జిల్లాస్థాయి అధికారులను మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే ఈ సందర్భంగా సత్కరించారు. ముందుగా ఆయా శాఖల వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను వీరు సందర్శించి, ' సంపూర్ణత అభియాన్ ' కార్యక్రమాన్ని తెలియజేసేలా ఏర్పాటుచేసిన సెల్ఫీ పాయింటు వద్ద ఫోటోలు దిగారు.

**యాస్పిరేషనల్ బ్లాక్ అంటే... ?**

దేశంలో వెనుకబడిన మండలాలను ( బ్లాక్స్), జిల్లాలను గుర్తించి వాటిని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు యాస్పిరేషనల్ బ్లాక్స్, యాస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. వివిధ శాఖలు సమన్వయంతో పని చేసి ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసేలా కొన్ని ప్రత్యేక ఇండికేటర్స్ ను నిర్దేశించింది. వీటి ఆధారంగా సాధించిన పురోగతిని పరిశీలించి వాటికి ర్యాంకులను కేటాయిస్తున్నది.

**రాష్ట్రంలోనే ఫస్ట్..!**

ఈ విధంగా రాష్ట్రంలో 15 మండలాలను ( బ్లాక్స్ ) కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. వాటిలో ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం మండలం కూడా ఉన్నది. ఈ మండలంలో 2023 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి యాస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ ( ఏ.బీ.పీ) ప్రారంభమైంది. ఈ బ్లాక్ లోని ప్రజల ఆరోగ్య స్థితిగతులు, ముఖ్యంగా చిన్నారులు, గర్భిణుల ఆరోగ్య సంరక్షణ, భూసార పరీక్షలు నిర్వహించి సాయిల్ హెల్త్ కార్డులు జారీ చేయడం, స్వయం సహాయక సంఘాలలోని మహిళలకు లభిస్తున్న రివాల్వింగ్ ఫండ్ వంటి ఇండికేటర్స్ ను ప్రామాణికంగా నిర్ధారించింది. ఈ విభాగాలలో అద్భుతమైన పురోగతి సాధించడం ద్వారా రాష్ట్రంలోనూ, కేంద్రస్థాయిలోనూ ఎర్రగొండపాలెం బ్లాక్ కు ప్రత్యేక గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం బంగారు పథకాన్ని అందించింది. ఈ కార్యక్రమంలో సిపిఓ సుధాకర్ రెడ్డి, డిఎంహెచ్ ఓ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్, డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ నారాయణ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సువర్ణ, ఎర్రగొండపాలెం ఎంపీడీవో ( యాస్పిరేషనల్ బ్లాక్ నోడల్ ఆఫీసర్ ) శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు. మండల స్థాయి సిబ్బంది అందరూ అతిథులు, ఉన్నతాధికారులతో గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



# ప్రజా సేవకుడు... ఏలూరి

- ఆయన సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకం
- ఏలూరి సేవలు భేష్ అంటున్న గ్రామస్తులు

**మార్కాపురం, డిసెంబర్ 08 (సందేశం టైమ్స్):** సమాజంలో కొందరు మానవతావాదులు అందిస్తున్న సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకంగా ఉంటున్నాయి. తోటి మనుషులు పడుతున్న బాధలను చూసి చలించిపోయి చేతనైన మేర సాయం అందిస్తూ గొప్ప మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఏ ఆసరా లేని ప్రజలకు మౌలిక సౌకర్యాలు అందిస్తూ అండగా ఉంటున్నారు. ఎదుటి మనిషి కన్నీరు తుడవడానికి ఏ బంధమూ ఉండనక్కర్లేదని.. స్పందించే హృదయం ఉంటే చాలని నిరూపిస్తున్నారు. ఇబ్బందుల్లో ఉన్న వారి జీవితాల్లో వెలుగురేఖలా నిలుస్తున్నారు. ప్రకాశం



జిల్లా పెద్దారవీడు మండలం గొబ్బూరు గ్రామస్తులు , జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఏలూరి వెంకట నారాయణరెడ్డి, ఎందరో కుటుంబ సభ్యుల ఆసరా లేని అనేక మందిని ఆదుకోవాలనే తలంపు, జన్మభూమి రుణం తీర్చుకోవాలనే భావనతో సేవా కార్యక్రమాలు చేస్తూ, తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ అందరి మన్ననలను ఏలూరి వెంకట నారాయణ రెడ్డి పొందుతున్నారు. ఆయన సేవా కార్యక్రమాలలో భాగంగా గొబ్బూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 10 వ తరగతి చదువుచున్న విద్యార్థినీ, విద్యార్థులకు సాయంత్రం స్టడీ హావర్స్ లో అల్పాహారం కోసం రూ.10 వేల సహాయం చేయడం ఆయన సేవలకు నిదర్శనం. ఈ విధంగా 6 సంవత్సరాల నుండి విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ వారి అభిమానాన్ని ఏలూరి వెంకటనారాయణ రెడ్డి పొందుతున్నారు. అంతేకాకుండా గ్రామలోని ఎస్సీ కాలనీకి చెందిన దొండపాటి కొండయ్యకి పక్షవాతం వచ్చి సదరం సర్టిఫికెట్ కోసం సచివాలయంలో అప్లై చేయగా వారికి విశాఖపట్నం గవర్నమెంట్ హాస్పిటల్ కి రెఫర్ చేశారు. కానీ వారు రెక్కాడితేకాని డొక్కాడని పేదవారు కావడంతో విశాఖపట్నం పోవడానికి డబ్బులు లేకపోవడంతో వెళ్లలేక పోయారు. విషయం తెలుసుకున్న ఏలూరి దొండపాటి కొండయ్య ఇంటి దగ్గరికి వెళ్లి ఖర్చులకు రూ.5 వేలు ఇవ్వడమే కాకుండా, నిరక్షరాసులైన వారితోపాటు మరొక అబ్బాయినీ పంపించడం విశేషం. గతంలో కూడా ఎంతోమంది గ్రామస్తులకు అవసరమైన అవసరాలను ఎన్నో తీర్చినందుకు ఏలూరి వెంకటనారాయణ రెడ్డి కి 10 వ తరగతి విద్యార్థులు, దొండపాటి కొండయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఇటువంటి వారికి నా చేతనయినంతలో సహాయ సహకారాలు అందించడం నాకు ఎంతో ఆనందంగా ఉందని , భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతానని ఈ సందర్భంగా వెంకట నారాయణరెడ్డి తెలిపారు.

# గ్రామాల్లో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలి: గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము..



**గుడివాడ డిసెంబర్ 08 సందేశం టైమ్స్** గుడివాడ నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలనీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వైద్య అధికారులకు సూచించారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ల వైద్య అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోమవారం సాయంత్రం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను ఎమ్మెల్యే రాము సమీక్షించారు. ఆరోగ్య కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆకాంక్షలకు గ్రామ గ్రామాన ప్రజలకు వైద్య సేవలు అందాలని వైద్యులకు సూచించిన ఎమ్మెల్యే రాము... సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.... మారుమూల గ్రామానికి సైతం ప్రభుత్వ వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, ఆరోగ్య కేంద్రాల్లో సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ముఖ్యంగా స్క్రబ్ టైఫస్ వ్యాధిపై గ్రామ గ్రామీణ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. అనారోగ్య సమస్యలు వస్తే ప్రజలు ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజానీకానికి సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని మోటూరు, రామాపురం, రుద్రపాక, గుడ్లవల్లేరు, కౌతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ బి. శ్రావ్య, డాక్టర్.మాధవి, డాక్టర్.దీప్తి, డాక్టర్.మంజూష సీ హెచ్. సాయికిరణ్, డాక్టర్ తేజ పలువురు వైద్యులు పాల్గొన్నారు.

# గన్నవరం దళితవాడ వాసుల పట్ల అధికారుల నిర్లక్ష్యం

## సిఎం ఆశయాలను నిరుగార్చుతున్న అధికారులు
## లబోదిబోమంటున్న దళితవాడ వాసులు



**గన్నవరం సందేశం టైమ్స్** దళితుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లు, డ్రైనేజీలు నూతన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గన్నవరం లోని చర్చి రోడ్డు నుండి గన్నవరం దళితవాడ వరకు రోడ్లు డ్రైనేజీలు నిర్మాణం జరిపారు. చర్చి రోడ్డు నుండి దళితవాడ వరకు డ్రైనేజీ నిర్మాణం జరిపారు. ఈ కాలువలో మురుగు నీరు మొత్తం దళితవాడ చేరుతుంది. డ్రైనేజీ పూర్తిగా నిర్మాణం జరపకుండా స్మశానవాటి సమీపంలో నివాసాల మధ్యలో నిలిపివేయడంతో పరిసర ప్రాంతాలు నీరు నిలిచిపోయి తీవ్రంగా దుర్వాసన వెదజల్లి దోమలు విపరీతంగా ప్రభాలుంచి జ్వరాల భారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో నిలిపివేసిన డ్రైనేజీ పూర్తిగా నిర్మాణం చేపట్టి సమస్యను వెంటనే పరిష్కరించాలని దళితవాడ వాసులు అధికారులను కోరుతున్నారు.

# ఇరిగేషన్ పనులు సత్వరమే పూర్తి చేయండి : యార్లగడ్డ



**గన్నవరం సందేశం టైమ్స్** గన్నవరం నియోజకవర్గంలో ఇరిగేషన్ పెండింగ్ పనులను, కొత్తగా మంజూరయిన పనులను సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులు ఆదేశించారు. సోమవారం సాయంత్రం విజయవాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో పలు పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గంలోని కాలువల మరమ్మత్తులు చేపట్టేందుకు ఇప్పటి నుంచి కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. వచ్చే ఖరీఫ్ సాగుకు జూన్ మొదటి వారంలోనే ఏలూరు కాలువకు నీళ్ల విడుదల చేసేందుకు కాలువ మరమత్తు పనులను పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ ఎస్ ఈ మోహన్ రావు మాట్లాడుతూ ఎనికేపాడు వద్ద బుడమేరు అండర్ టన్నెల్ ప్రస్తుతం 4 వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం ఉండగా బుడమేరు వరద నివారణకు దీనికి అదనంగా 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో మరో అండర్ టన్నెల్ నిర్మించనున్నామని ఈ పనులు ప్రారంభిస్తే జనవరి నుంచి జూన్ నెల వరకు ఆరు నెలల పాటు ఏలూరు కాలువ కు నీటి విడుదలను ఆపాల్సి ఉంటుందని తెలిపారు. ఆరు నెలలపాటు ఏలూరు కాలంలో నీటి ప్రవాహాన్ని నిలిపి వేస్తే గన్నవరం నియోజకవర్గం తో పాటు ఏలూరు జిల్లాలోని కొన్ని మండలాల ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని, తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని యార్లగడ్డ అధికారులకు సూచించారు. అనంతరం గన్నవరంలో గాంధీ బొమ్మ సెంటర్ రోడ్ విస్తరణ పనుల పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డివిజన్ డియి గంగయ్య, ఏఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# డీవో వ్యవస్థ రాకతో... పంచాయతీరాజ్ శాఖలో 10వేల ప్రమోషన్లు ఓ చరిత్ర



**అల్లూరి సీతారామరాజు జిల్లా సందేశం టైమ్స్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జానపద కళలు సృజనాత్మకత అకాడమీ చైర్మన్ డా!! గంగులయ్య మాట్లాడుతూ ఏ ఉద్యగంలోనైతే చేరారో అదే ఉద్యోగంలో రిటైర్ అయిన సందర్భాలు ఉన్నాయని... ఏ ఉద్యోగికైనా అది సంతృపితే. ఆ బాధను తొలగించిన నాయకుడు జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు గా!! శ్రీ పవన్ కళ్యాణ్ 30 ఏళ్ల ప్రోమోషన్ల లేని పంచాయతీ రాజ్ శాఖలో డీడీవో వ్యవస్థతో ఒకే సారి 10 వేళ మందికి ప్రమోషన్లు ఇవ్వడం కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమైందనన్నారు... గతంలో వైసీపీ వాళ్ళు అయితే 100 కోట్లు వసూలు చేసేవారు అని మండి పడ్డారు... ఇవే ఉద్యోగాలు వైసీపీ ప్రభుత్వంలో ఇస్తే ఉద్యోగులను, ఉద్యోగ సంఘ నాయకులను వారి చుట్టూ తిప్పించుకునేవారు. ఇంత అని రేటు పెట్టేసేవారు..10 వేళ ఉద్యోగాలు అంటే రూ.100 కోట్లు వసూలు చేసేవారని ఆగ్రహం వ్యక్తం చేశారు... వ్యవస్థగత మార్పులకు ఇది నాంది పలుకుతుందని తెలియపరుస్తున్నామనారు...

# రోడ్డు ప్రమాదంలో ఆర్ఐ దుర్మరణం



**పులివెందుల డిసెంబర్ 8 (సందేశం టైమ్స్):** రోడ్డు ప్రమాదంలో ఆర్ఐ దుర్మరణం చెందిన సంఘటన తొండూరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. తొండూరు తహసిల్దార్ కార్యాలయంలో ఆర్ ఐ గా కుమారి పనిచేస్తోంది. విధుల నిర్వహణ అనంతరం ఆమె 7 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి బైక్ పై పులివెందులకు బయలుదేరింది. మార్గమధ్యంలో మదూరు సమీప ప్రాంతంలో లారీని ఓవర్టేక్ చేయడంలో బైకు అదుపుతప్పి కింద పడింది. దీంతో కుమారి లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times3-82, Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508206Gmail : sandeshamtimes@gmail.comWebsite: https://sandeshamtimes.comPublisher : MADDINENI NAGESWARA RAOAddress104, HILLS APARTMENT, Press (Name & Address)SUNDAY PRINTING PRESS3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH-522006